# సమయం రావాలి!

— సుధామ

శ్రీకాంత్ ఆంధ్ర రాజధానీ నగరంలో పేవ్‌మెంట్ మీదుగా నడుస్తున్నాడు. బ్యాంక్ స్ట్రీట్ రోడ్డులో ఒకచోట పెద్ద గుంపు చేరివుంది. ఆ దరిదాపుల్లో పోలీసు లెవరూలేరు. ఎవడో ఒకడు—నవారు గుడ్డలావుంది. మెలికలు పెట్టి చూస్తున్న వారి చేతికి ఒక కట్టెపుల్ల యిచ్చి ఆ మెలికల మధ్య ఎక్కడైనా పెట్టమన్నాడు. వాడు పెట్టగానే నవారు గుడ్డను మెలికలు విప్పేస్తున్నాడు. పూర్తిగా విప్పబడకుండా వుంటే ఆ కట్టెపుల్ల పెట్టినమనిషి 'సవాల్' అని వాడి ముందర ఎంత డబ్బు పెడితే దానికి రెట్టింపు యిస్తున్నాడు ఒక వేళ విప్పబడితే ఆ డబ్బు తను తీసేసుకొంటున్నాడు. అంతా వాడి చేతిల్లోనేవుంది చిట్కా! వాడికి తెలుసు. ఏ విధంగా మెలికలుపెడితే అది పూర్తిగా విప్పబడుతుందో చూసేవారు, డబ్బుపెట్టి ఆడేవారు లాభం పొందుతారు. అంతా అదృష్టం మీద ఆధారపడి వుంటుంది అన్నట్లుగా అప్పుడప్పుడు మటుకు విప్పబడని విధంగా పెడుతూంటాడు. ఇదొక పెద్ద ఘోరం. అన్యాయమయిన జూదం.

కష్టపడి కూలీ నాలీ చేసే జనం తమ డబ్బుకు రెండింతలు వస్తుందని ఆశపడి సర్వం పోగొట్టుకొని నిరాశగా భార హృదయంతో అడుగులేస్తూ వెళ్ళిపోతూంటారు. పురానా పెద్దమనుషులు సైతం ఈ మాయలో పడుతూవుంటారు. కానీ పోలీసు వారుకానీ, న్యాయానికి సంబంధించిన మరే యితర వ్యక్తిగాని, అవినీతి నిరోధక శాఖ వారు గానీ కనపడితే ఈ గుంపు చెదిరిపోతుంది. ఆ మనిషి పారిపోతాడు. అదంతా ఒక త్రుటిలో జరిగిపోతుంది. అసలు ఆ మనిషి ఎవరో, ఎటుపోయాడో గూడా జాడ మాత్రమైనా కనబడదు. ఇది చాలా ఆశ్చర్యకరమయిన విషయం. పట్టుకోడానికి వచ్చిన మనిషి చాలా సేపు గాలించి పరిగెత్తి లాభంలేక వెళ్ళిపోతాడు. శ్రీకాంత్ ఈ దృశ్యాలను రోజూ చూస్తున్నాడు. అతను ఉదయం 8 గంటలకు బస్సుకెళ్ళే దోవలోనే ఆ మనిషి అదే సమయానికి గుంపుతో జూదమాడుతూ కనపడతాడు. శ్రీకాంత్ ఎదురుగానే రెండు మూడు పర్యాయాలు పోలీసులు రావడం గుంపు చెదిరిపోవడం జరిగింది. ఆ ఆడించే మనిషి ఎటుపోయాడోనని శ్రీకాంత్ కూడా ఆశ్చర్యపడేవాడు. శ్రీకాంత్ దిన చర్యలో ఇది ఒక భాగమయిపోయింది. అటువంటి జూదాలాడేవైపు చూడకూడదని ఎన్నో మార్లనుకొనేవాడు. కానీ అదేం మాయో? ఆ ప్రదేశం దగ్గరకు వచ్చేసరికి చూపులు ఎంత వద్దన్నా అటుమరలేవి. కాళ్లు రెండు నిమిషాలపాటు నిలిచిపోయేవి ఒక్కోసారి అటు చూస్తూంటే తను ఎక్కవలసిన బస్సు బయలు దేరడంచూసి పరిగెత్తవలసి వచ్చేది.




ఆ రోజు విధి వక్రించినదినం. శ్రీకాంత్ జీవితం మలుపులు తిరిగినదినం. అధర్మం అన్యాయంగా గెలిచినరోజు, తప్పు చేయని వ్యక్తి శిక్ష పొందిన దినం. నేడు ప్రపంచంలో రాత్రిపూట చీకటిలా ఆవరించుకున్న అవినీతికి ఆటపట్టు దినం. సంఘంలో గౌరవంగా బ్రతుకుతున్న ఒక మనిషి ఛీ! అనిపించుకున్న దినం. నమ్మడానికి లేని ఆధారాలు ప్రత్యక్షమయినదినం ఒక పుట్టు మచ్చ చేసిన గొడవ. వేయించిన శిక్ష. తలుచుకొంటేనే కరడుగట్టిన హృదయం సైతం మంచులా నీరు కారుతుంది అదే! ఆ రోజు...

శ్రీకాంత్ మామూలుగా అదేరోడ్డు మీద అదే సమయంలో అక్కడనుండే వెడుతున్నాడు. అక్కడికి వచ్చేసరికి అనుకోకుండానే అతని దృష్టి ఆ అన్యాయపు ఆట మీద నిలిచిపోయింది. "ఆట ఆడితే" ఎన్నడూలేనిది మనసులో వింత భావనలు మొలకెత్తాయి. జేబులో నిన్న వచ్చిన జీతం 400 రూపాయలూ అలానేవున్నాయ్. ఆట రంజుగా సాగుతోంది పది నిమిషాలు గడిచాయి. శ్రీకాంత్ ఆడనేలేదు, మనసులోని వింత భావన అణచివేసి అలానే నిల్చుని వున్నాడు. ఎక్కడనుండి-వచ్చాడో ఒక అవినీతి విరోధక శాఖ వ్యక్తి అంతే! చిటికెలో గుంపు చెల్లా చెదరయిపోయింది. శ్రీకాంత్ తన బస్‌స్టాండ్ వైపు చూసాడు బస్సు బయలుదేరబోతోంది. రన్నింగ్ బస్‌ను క్యాచ్ చేద్దామని పరిగెత్తాడు. ఎవరో వ్యక్తి శ్రీకాంత్‌ను రాచుకుంటూ రోడ్డు దాటి పోయాడు. శ్రీకాంత్ బస్సు పోతుందనే భయంతో పరుగు వేగం మరింత హెచ్చించాడు. 'ఆగు' బలంగా అవినీతి నిరోధక శాఖ వ్యక్తి చేతులు శ్రీకాంత్‌ను ఆపివేసాయి

"ఉః ఎన్నాళ్ళ నుంచి పేద ప్రజానీకాన్ని ఇలా మోసంచేసి డబ్బు గడిస్తున్నావ్" అతని కంఠం ఖంగు మంది. శ్రీకాంత్ నీరు కారిపోయాడు. నిశ్చేష్ఠదయ్యాడు. ఏ పాపమూ ఎరుగని తనకా ఈ నేరం అంటగట్టడం?

"లేదుసార్! నేను అగ్రికల్చరల్ ఆఫీసులో సూపరెంటెగా వర్కు చేస్తున్నాను. మీరు పొరబడుతున్నారు" అన్నాడు తప్పు చేయలేదు కనుక దృఢంగా నవ్వుతూను.

"ఒహో! నా కళ్ళే కప్పజూస్తున్నావా? పైగా అబద్దాలు కూడానా? రాస్కెల్! నేరం చేయకపోతే నే రాగానే ఆ పరుగులెందుకూ?"

"మీరు పొరబడుతున్నారు. నేను ఆఫీసు టైమయిందని బస్సు కదలడంతో అందుకుందామని పరిగెత్తుతున్నాను."

"యూ బ్రూట్! ఎంత పెద్ద అబద్ధం. సూపరెంటువా? అయితే ఈ నవారు గుడ్డ, కట్టెపుల్ల తమకెందుకు స్వామీ?" శ్రీకాంత్ జేబులోంచి వాటిని తీస్తూ డిటెక్టివ్ పోజులో అన్నాడా వ్యక్తి.

శ్రీకాంత్ తెల్లబోయాడు. తెలిసింది! ఇందాకా తనను రాచుకుంటూ రోడ్డు దాటిన వెధవపని యిది.

"లేదు! నిజంగా నేనే పాపమూ ఎరుగను. ఎవరో పారిపోతూ ఇవి నా జేబులో పెట్టుంటాడు. మర్యాదగా మనలండి"

"షటప్! యూ స్కౌండ్రెల్! ఈడియట్! మర్యాదగా మసలాలా! బుకాయిస్తావ్? కొండంత సాక్ష్యం కళ్ళ ఎదురుగా కనిపిస్తూంటే బుకాయిస్తావా? రాస్కెల్! ఎవరో పెట్టారట. జేబులో 400 రూపాయలు వున్నాయ్! దీనితో సంపాదించినవికావూ! నవారు గుడ్డ, కర్రపుల్ల, ముఖ్యంగా నా కొకరు చెప్పారు ఈ ఆట ఆడించే వాడికి కుడి చెంపమీద పుట్టుమచ్చ వుంటుందని—అదీ. ఇన్ని సాక్ష్యాలు నన్ను చూడగానే నువ్వు పారిపోవడం. ఎవరయ్యా! నేరం నువ్వు చెయ్యలేదనడానికి? పైగా బుకాయిస్తావ్" శ్రీకాంత్ చెంప ఛెళ్లుమంది. ఏమంటాడు శ్రీకాంత్.

* * *

శ్రీకాంత్ భార్య జ్యోత్స్న బెయిలుకు వచ్చింది. కొరడా దెబ్బలతో తట్లు తేలిన తనువును జ్యోత్స్న రాకతో బలవంతంగా నవ్వు తెచ్చుకొని సరిగా కూర్చున్నాడు. ఆమె ఈ అన్యాయానికి క్రుళ్ళి క్రుళ్ళి ఏడుస్తోంది. శ్రీకాంత్ అన్నాడు. "ఊరుకో! జ్యోత్స్న! ఊరుకో! లోకంలో మానవత్వం, న్యాయా న్యాయ విచక్షణా జ్ఞానం నశించి పోయాయి జ్యోత్స్నా! నేను నిజం చెప్పినా ఎవరూ నమ్మలేదు. నమ్మరు. చేయని నేరం నాకంటగట్టి లోకం నన్ను 'అదుగో! పేద ప్రజల పొట్టలుగొట్టి బ్రతికే మోసగాడు ఛీ!' అంది. అయినా విచారించకూడదు జ్యోత్స్న! కాలం కలసి రాలేదు. పైనా దేవుడంతా చూస్తున్నాడు. అతగాడు వీరికి బుద్ధి చెప్పకపోడు. కానీ అతనికి సమయం రావాలి జ్యోత్స్నా! సమయం రావాలి. రాగానే ఈ మానవుల్లోని కల్మషాన్ని కడిగి పాపాన్ని రూపుమాపి మానవత్వాన్ని మేల్కొల్పుతాడు. నన్ను నిన్ను ఆశీర్వదించి మన నిజాయితీకి మంచితనానికి తన దరిచేర్చుకుంటాడు. అంతే ఆ సమయం కోసమే మనం బ్రతికేది!"

అవును శ్రీకాంత్ కాదు; భగవంతుడున్నాడని నమ్మేవాళ్ళంతా ఆ సమయం కోసమే ఎదురు తెన్నులు చూడాలి! అంతదాకా బ్రతకాలి. అంతకంటే గత్యంతరం ఏముంది? ★


# ది నిజాం షుగర్ ఫ్యాక్టరీ లిమిటెడ్

ఇండియాలోకెల్ల పెద్ద పంచదార ఫ్యాక్టరీ

ఆధునిక పరికరములతో ఆరోగ్యకరములగు పద్ధతులతో పరిశుభ్రముగా, రుచికరముగా తయారుచేయబడిన "నీఫా" బ్రాండు స్వీట్లు, టాఫీలు.

హెడ్డాఫీస్ :
ఫతేమైదాన్ రోడ్డు
పో. బా. నెం-1
ఖైరతాబాద్
హైదరాబాద్, ఆం.ప్ర.
కేబుల్స్. గ్రామ్స్-"సుగర్"

కన్స్ట్రక్షనరీ :
అజామాబాద్
హైదరాబాద్, ఆం.ప్ర.
ఫోన్-34450
ఫోనులు-34059, 33177, 33485, 33486.

ఫ్యాక్టరీ:
శక్కర్‌నగర్, సెంట్రల్ రైల్వే
ఆం. ప్ర